క్లుప్తంగా

తలసేమియా చిన్నారికి రక్తదానం



రక్తదానం చేస్తున్న రాజశేఖర్

శ్రీకాకుళం కల్చరల్: దీర్ఘకాలిక తలసేమియా వ్యాధితో బాధపడుతున్న హిరమండలానికి చెందిన భవానీ అనే చిన్నారికి పాలకొండకు చెందిన కాగితపల్లి రాజశేఖర్ శుక్రవారం రక్తదానం చేశారు. దీంతో ఆయనను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు అభినందించారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ మేనేజర్ ఆయేషా బేగం, టెక్నీషియన్ వెంకటేష్, పీఆర్‌వో నంది ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న విధుశేఖర భారతి స్వామి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుజరాతీపేటలో ఉన్న శ్రీరాజరాజేశ్వరీ లలితా మహా త్రిపురసుందరి దేవీపీఠంలో మే 2 నుంచి జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్సవాల కరపత్రాలను శృంగేరి పీఠం ఉత్తరాధికారి విధుశేఖరభారతి శుక్రవారం ఆవిష్కరించారు. కరపత్రాలను శృంగేరిలోని శంకరాచార్య మహాసంస్థ పీఠం విధుశేఖర భారతికి అందచేసి ఆశీస్సులు అందుకున్నట్లు రాజరాజేశ్వరీ పీఠం ప్రతినిధిని పెంట వాశిష్ట కార్తికేయ శర్మ తెలిపారు.

క్షీరాభిషేకం



అమ్మవారికి పూజలను నిర్వహిస్తున్న బాలభాస్కరశర్మ

ఎచ్చెర్ల: మండలంలోని కుంచాలకుర్మయ్యపేటలో గల దేవీ ఆశ్రమంలోని మహామేరువుకు పీఠాధిపతి బాలభాస్కరశర్మ శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



భవాని కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

రణస్థలం: పైడిభీమవరంలో ఇటీవల హత్యకు గురైన అవాల భవాని కుటుంబానికి అండగా ఉంటామని రాష్ట్ర యాదవ సంఘ నాయకుడు కాయితి వెంకటరమణ తెలిపారు. శుక్రవారం మండలంలోని లోడగలపేట(గొల్లపేట)లోని భవాని ఇంటి వెళ్లి యాదవ సంఘ నాయకులు పరామర్శించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడం దారుణమన్నారు. ఎచ్చెర్ల యాదవ సంఘ నాయకులు ముద్దాడ రాజశేఖర్, జాడ శంకర్, కాయితి రమణ, దొప్ప రాము, జోగ శ్రీనివాస్, పెసల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.


అంతర పంటలకు ప్రాధాన్యం



బొప్పాయిలో అరటి సాగు చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని పలు గ్రామాల్లో అంతర పంటలకు అధికప్రాధాన్యం ఇస్తున్నారు. వెంకటాపురం గ్రామంలో బొప్పాయి సాగును విరివిగా పండిస్తున్నారు. బొప్పాయి పంటలో అంతరపంటలుగా అరటి, జామ పంటలు పండిస్తున్నారు. దీనివలన ఒక పంట దిగుబడి తగ్గినా.. మరోపంట కలసివస్తోందని రైతులు అంటున్నారు. బహుళ పంటలు ఎకకాలంలో ఒకేచోట పండించడం వలన రైతులు నష్టపోకుండా ఉంటారని చెబుతున్నారు.

వ్యక్తిత్వ వికాసాన్ని అలవర్చుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న భాస్కరభట్ల శ్రీరామశర్మ

శ్రీకాకుళం కల్చరల్: విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని అలర్చుకోవాలని ప్రవచనకర్త భాస్కరభట్ల శ్రీరామశర్మ అన్నారు. స్థానిక కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న ఆరోహి మ్యూజిక్ స్కూల్‌లో ఉచిత వేసవి శిక్షణా తరగతులు శుక్రవారం ప్రారంభించారు. శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీచర్ ఆనెం భాస్కరరావు, జ్యోత్స్న, భరత్ తదితరులు పాల్గొన్నారు.

అంతిమ యాత్రకూ అవస్థలే!



శిథిలావస్థలో ఉన్న స్వర్గధామం

- అధ్వానంగా పురపాలక 'స్వర్గధామం'
- పేదలకు తప్పని ఇబ్బందులు
- అందుబాటులోకి రాని క్రిమిటోరియం
- పట్టించుకోని అధికారులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొత్త బ్రిడ్జి వద్ద ఉన్న శ్మశాన వాటికలో కనీస సదుపాయాలు కరువయ్యాయి. ఇదే ప్రాంతంలో రోటరీ కైలాసం ఉంది. అక్కడ డబ్బులు చెల్లిస్తే అన్ని రకాల సదుపాయాలు పొందవచ్చు. నిరుపేదలు, అనాథలు, బంధువులు లేనివారి మృతదేహాల్ని మాత్రం మున్సిపల్ పరిధిలోని స్వర్గధామానికే తీసుకొస్తుంటారు. పేరుకే స్వర్గధామం కానీ అక్కడ సౌకర్యాలు లేక అంతా నరకంగానే ఉంటుంది. కనీసం కాళ్లు,చేతులు కడుగుదామన్నా నీటి సౌకర్యం ఉండదు. దహన ప్రక్రియ సన్నాహకాలు జరిగే సమయంలో కాసేపు కూర్చుందామన్నా సిమెంట్ బెంచీలు వంటి సదుపాయాలు లేవు. దేహం కాలినంతసేపు అక్కడే ఉందామన్నా నిలువ నీడ లేదు. ముఖ్యంగా మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం కల్పించలేదు. ప్రస్తుతమున్న భవనం, కింద పునాదులు, పక్కడ ఉన్న గోడలు శిథిలమైపోయాయి. శవాలు కాల్చుతున్న సమయంలో ఎవరిపై పెచ్చులూడిపడిపోతాయో తెలియని పరిస్థితి. పక్కన ఉన్న గోడలు సైతం ఊడిపోయి కిందకు పడుతున్నాయి. కాల్చుతున్న మధ్యలో వర్షం పడితే సగం కాలి ఆగిపోయే దుస్థితి నెలకొంది. ఇటువైపుగా ఇసుక బల్లు నిత్యం రాకపోకలు సాగించడంతో రాత్రి వేళల్లో ఆ రోడ్డంతా ఇసుకతో నిండిపోయి కనీసం నడిచేందుకు కూడా వీలు లేకుండా మారింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్యాస్ క్రిమిటోరియం నిర్మాణం పూర్తయినా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం ఆ ప్రాంతమంతా పూర్తిగా పిచ్చిమొక్కలతో పేరుకుపోయి అడవిని తలపిస్తోంది. నిరుపేదల దహన సంస్కారాల విషయంలో ప్రభుత్వానికి అంత నిర్లక్ష్యం పనికి రాదని పలువురు మండిపడుతున్నారు.

కొత్త భవనం నిర్మించాలి..



స్వర్గధామం భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. పెచ్చులూడి ఎప్పుడు ఎవరిపై పడిపోతుందో తెలియని పరిస్థితి. ఎక్కువగా నిరుపేదల మృతదేహాలకు ఇక్కడే దహన సంస్కారాలు చేస్తుంటారు. కొత్త భవనాన్ని నిర్మాణం చేస్తే అందరికి ఉపయోగపడుతుంది.

– పి.జగదీష్, స్వర్గధామం వాచ్‌మేన్, శ్రీకాకుళం

బాగు చేయిస్తాం..



స్వర్గధామం శిథిలావస్థకు చేరిన విషయం మా దృష్టికి రాలేదు. పరిశీలించి చర్యలు చేపడతాం. అవసరమైన పనులు చేసి ఎవ్వరికి ఇబ్బంది నిర్మిస్తాం. మరమ్మతులు చేయాల్సి ఉంటే అంచనాలు రూపొందించి బాగుచేయిస్తాం.

– పి.వి.వి.డి ప్రసాదరావు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, శ్రీకాకుళం



పైకప్పు పూర్తిగా పాడైపోయిన దృశ్యం



పాడైపోయిన సైడ్‌వాల్స్

‘ఫ్రైడే..!



గత వారం రోజులుగా ప్రతిరోజూ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీనివలన ప్రజలంతా ఉక్కపోతకు నానా ఇక్కట్లు పడుతున్నారు. శుక్రవారం ఎండ ప్రభావంతో నగరంలోని రహదారులు నిర్మానుష్యంగా మారాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

చలివేంద్రం ప్రారంభం



గార మండల కేంద్రంలోని ఏసుక్రీస్తు మహిమ మందిరం వద్ద శుక్రవారం చలివేంద్రం ప్రారంభించారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని బిషప్ వి.జాషువా ఆధ్వర్యంలో స్వర్ణహోప్ ఫౌండేషన్ సుదర్శనరావు దీనిని ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ ప్రజలకు మజ్జిగను అందిస్తామని తెలియజేశారు. సర్పంచ్‌లు కొయ్యాన ఆదినారాయణ, గొల్లంగి వెంకటేశ్వర్లు అభినందించారు. - గార

అన్నదాత అవస్థలు



గార మండలంలోని కొట్లాం, కొర్ని ప్రాంతంలో విద్యుత్ మోటార్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పంటలు ఎండిపోతున్నాయి. గత 15 రోజులుగా త్రీఫేజ్ విద్యుత్ ఎప్పటికప్పుడు నిలిపివేస్తుండడం వలన వరి, మొక్కజొన్న, మిరప పంటలకు నీరు పెట్టలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం తూలుగు సబ్‌స్టేషన్‌కు వెళ్లి వినతిపత్రం అందజేశారు. సక్రమంగా విద్యుత్ సరఫరా అందజేయాలని కోరారు. - గార

నవధాన్యాల సాగుతో.. భూసారం



దేవాది వద్ద నవధాన్యాల ద్వారా సాగు చేసిన పొలం

- రసాయనిక ఎరువులతో తగ్గుతున్న భూసారం
- ప్రకృతి వ్యవసాయంతో సమస్యలకు చెక్
- నరసన్నపేట నియోజకవర్గంలో 7,400 కిట్లు పంపిణీకి లక్ష్యం

నరసన్నపేట: భూతాపం తగ్గాలన్నా.. భూసారం పెరగాలన్నా.. మనం తినే ఆహారం ఆరోగ్యాన్ని ఇవ్వాలన్నా రైతులంతా తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయం చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రసాయనిక ఎరువుల వలన భూసారం బాగా తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో ఆ భూములను మళ్లీ సారవంతంగా చేయాలంటే రైతులంతా ప్రకృతి వ్యవసాయం చేయాలని అధికారులు సూచిస్తున్నారు. భూసారం తగ్గిన పొలాల్లోనే కాకుండా చౌడు భూములు సైతం మళ్లీ సారవంతం కావాలంటే రైతులు ఖరీఫ్ సీజన్‌కు ముందే నవధాన్యాల సాగు చేయాలి. ప్రకృతి వ్యవసాయం సిబ్బంది సుమారు 12 కిలోల బరువున్న నవధాన్యాల విత్తనాల కిట్లును రూ.1,100 అందజేస్తున్నారు. ఈ కిట్‌లో 25 రకాల విత్తనాలు ఉంటాయి. ఇలా మిశ్రమ విత్తనాల సాగు వల్ల భూమిలో జీవవైవిధ్యం పెరిగి భూమి సారవంతం అవుతోంది. నరసన్నపేట నియోజకవర్గంలో గతేడాది 2,010 ఎకరాల్లో పకృతి వ్యవసాయం సాగుచేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 7400 ఎకరాల్లో సాగు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

నవధాన్యాల సాగుతో ప్రయోజనాలు ఇవే..

- పొలంలో నవధాన్యాలను కలియదున్నితే భూసారం పెరుగుతుంది.
- మొక్కలకు నత్రజని, సూపర్ ఫాస్ఫేట్ అదనంగా అందుతుంది.
- జింకు, మాంగనీస్, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మధాతువులు పంటకు చేకూరుతాయి.
- నేలలో కరగని మూలకాలను పంటకు అనుకూలంగా మారుస్తాయి.
- నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. వానపాముల ఉత్పత్తికి దోహదపడుతుంది.
- నేల భౌతిక స్థితి మెరుగుపడి, భూమి గుల్లగా మారి నేలలోనికి నీరు ఇంకే గుణం పెరుగుతుంది. వేరు వ్యవస్థ అభివృద్ధి చేస్తాం.
- నేలలో సేంద్రియ పదార్థం వేయడంతో సూక్ష్మ జీవులు వృద్ధి చెందుతాయి. నేలలో సారం పెరగడమే కాక నేల సంపూర్ణ ఆరోగ్యాన్ని సంతరించుకొని ఉత్పాదకత సామర్థ్యం పెరుగుతుంది.
- నేలలో లభ్యం కాని రూపంలో ఉన్న అనేక పోషకాలను లభ్య రూపంలోనికి మారుస్తాయి. కలుపు మొక్కలు పెరగకుండా నివారించవచ్చు.
- భాస్వరం, గంధకం వంటి పోషకాల లభ్యత గణనీయంగా పెరుగుతుంది.
- నాణ్యమైన గింజలు ఉత్పత్తి అవుతాయి. దిగుబడి రెట్టింపు అవుతుంది.

సాగు చేసే విధానం ఇలా..

వేసవిలో దుక్కి దున్ని తొలకరి వర్షాలు పడగానే పొలంలో చల్లు కోవాలి. నవధాన్యాలు వేసిన 45 రోజులు వ్యవధిలోని పూత దశలో దమ్ము చేయాలి. పశువుల మేతకు ప్రయోజనం. నీటి వసతి కలిగిన ప్రాంతాల్లో వేసవిలో సాగు చేయడం లాభదాయకం. చల్లుకుని కలియ దున్నుకోవచ్చు.

దళిత సర్పంచ్‌పై దాడి దారుణం



పొన్నాడ రుషి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): చిత్తూరు జిల్లా విజయపురం మండలం ఎం.అగరం దళితవాడలో ఒక దళిత సర్పంచ్‌పై టీడీపీ నేతలు దాడి చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ సీనియర్ నాయకుడు పొన్నాడ రుషి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి హామీ పనులు చేపట్టేందుకు వీలుగా గ్రామ పంచాయతీ తీర్మానానికి ఆమోదం తెలియజేస్తే దాడి చేయడం సరికాదన్నారు. ఈ హేయమైన చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక రెడ్ బుక్ రాజ్యాంగం ద్వారా దళితులపై వివక్షత, సాంఘిక బహిష్కరణలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు ఆత్మస్థైర్యాన్ని కల్పించి సమాజంలో గౌరవం పెంచిన వ్యక్తి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు దాడులకు స్వస్తి చెప్పాలని సూచించారు.

ప్రమాద బీమా కల్పించాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అసంఘటిత రంగ కార్మికులకు కార్మిక చట్టాలు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కార్మిక సంఘాల నాయకుడు టి.తిరుపతిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ముత్యాలమ్మ మార్కెట్ వద్ద శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అసంఘటిత రంగ కార్మికులకు ఎటువంటి కార్మిక చట్టాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. ప్రతి ఒక్కరికీ ప్రావిడెంట్ ఫండ్, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా తదితర కార్మిక సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. మే డేను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎన్.దుర్గారావు, పి.సత్యంలను అధ్యక్ష, కార్యదర్శులుగా, ఎల్.రవణ, విశ్వనాథం, రాము, కె.కృష్ణ, సూర్యనారాయణ, రామారావు, ఆదినారాయణ, చిన్నారావు తదితర సభ్యులతో కూడిన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

ఆడవరంలో వేసవి శిక్షణ శిబిరం

గార: మండలంలోని అంపోలు పంచాయతీ ఆడవరం ప్రాథమిక పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం భోగెల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌కు బానిస కాకుండా ఉండేందుకు, టీవీలకు అతుక్కుపోకుండా చూసేందుకు ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించడం, కథలు చదివించడం, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రతిరోజూ మజ్జిగను అందజేస్తున్నామన్నారు.



శిక్షణ శిబిరంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఇంజినీరింగ్ విద్యార్థిని అదృశ్యం

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని బలగ బాలాజీ నగర్‌కు చెందిన విద్యార్థిని అదృశ్యమైనట్లు రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. బాలాజీనగర్ నాలుగో వార్డులో తన భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి ఒక ఉద్యోగి నివసిస్తున్నాడు. ఆయన పెద్ద కుమార్తె తగరపువలసలోని ఒక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతుంది. ప్రతిరోజూ ఉదయం 7.30 గంటలకు కాలేజీ బస్సులో వెళ్లి తిరిగి మళ్లీ అదే బస్సులో సాయంత్రం వచ్చేసేది. ఈక్రమంలో ఈనెల 24న కళాశాలకు బస్సులో వెళ్లిన విద్యార్థిని తిరిగి ఇంటికి చేరకపోవడంతో ఆమె మొబైల్ నంబర్‌కు తండ్రి ఫోన్ చేశాడు. అయితే స్విచ్ఛాఫ్ రావడంతో పలుమార్లు ప్రయత్నించాడు. చివరికి కళాశాల యాజమాన్యానికి ఫోన్ చేయగా ఆరోజు కళాశాలకు కూడా విద్యార్థిని రాలేదంటూ చెప్పడంతో అవాక్కయ్యారు. వెంటనే స్నేహితులు, బంధువుల వద్ద ఆచూకీ కోసం యత్నించినా ఫలితం లేకపోయింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ప్రిన్సిపాల్‌గా శ్రీరాములు



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీరాములు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ (పూర్తి అదనపు బాధ్యతలు)గా కణితి శ్రీరాములు నియామకం అయ్యారు. శుక్రవారం సాయంత్రం శ్రీరాములు బాధ్యతలు స్వీకరించారు. శ్రీరాములు ప్రస్తుతం పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. కాగా ఇప్పటివరకు శ్రీకాకుళం జీడీసీ మెన్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన పెంకి సురేఖను భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. అయితే ఈమె అనేక సాంకేతిక కారణాలు చూపుతూ ఇంకా బాధ్యతలు స్వీకరించలేదని సమాచారం. మరలా శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



ఎచ్చెర్ల క్యాంపస్: కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, అధ్యాపకులు, విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్: పహల్గాంలో అమాయకులైన భారతీయులను అతి కిరాతకంగా ఉగ్రవాదులు చంపిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈ ఘాతుకానికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిస్ట్రిక్ట్ బ్యాంక్ ఎంప్లాయీస్ కో–ఆర్డినేషన్ కమిటీ జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసులు అన్నారు. ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపు మేరకు శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ బ్యాంక్ ఎంప్లాయీస్ కో–ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం శ్రీకాకుళంలోని జీటీ రోడ్డులో ఉన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అలాగే వైఎస్సార్ కూడలి వరకు ర్యాలీగా వెళ్లి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ శ్రావణి, యూనియన్ బ్యాంక్ సూర్య, కరుణ బ్యాంక్ ఆఫ్ ఇండియా గురుప్రసాద్, కెనరా బ్యాంక్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడులు పిరికిపంద చర్య

కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడం పిరికిపంద చర్య అని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్, మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ధ్వజమెత్తారు. ఈ మేరకు సూర్యమహల్ కూడలిలో శాంతి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఉగ్రదాడిని ప్రపంచ దేశాలన్నీ ఖండించాలన్నారు. ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తూ వారి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు నటుకుల మోహన్, లయన్ ప్రొ.డి.విష్ణుమూర్తి, లయన్ పొన్నాడ రవికుమార్, డా.బాడాన దేవభూషణరావు, డాక్టర్ పి.సింధూర తదితరులు పాల్గొన్నారు.

అందరూ ఖండించాలి

ఉగ్రదాడులను ప్రపంచమంతా ఖండించాలని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు, సన్‌రైజ్ ఆస్పత్రి ఎండీ డా.బొడ్డేపల్లి సురేష్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల రోడ్‌లోని సన్‌రైజ్ ఆస్పత్రి సిబ్బంది ఉగ్రదాడులను ఖండిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

ఉగ్రదాడి అమానుషం

ఎచ్చెర్ల క్యాంపస్: కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడిని ఖండిస్తూ శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ఎస్ఎంపురం క్యాంపస్‌లో శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించటాన్ని నిరసించారు. విద్యార్థులు మౌనం పాటించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ, ఏఓ ముని రామకృష్ణ, డీన్ శివరామకృష్ణ పాల్గొన్నారు. అలాగే కుశాలపురంలో అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు.



శ్రీకాకుళం అర్బన్: మృతులకు నివాళులర్పిస్తున్న దృశ్యం



శ్రీకాకుళం అర్బన్: నిరసన తెలుపుతున్న ఆస్పత్రి సిబ్బంది



ఎచ్చెర్ల క్యాంపస్: కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న అక్షయ సేవా సమితి సభ్యులు



శ్రీకాకుళం అర్బన్: వైఎస్సార్ కూడలి వద్ద నిరసన తెలుపుతున్న బ్యాంక్ ఉద్యోగులు